

# నిజం
## దృష్టి తెలుగు న్యూస్

TG/TEL/25/A3731

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-281 | పేజీలు:-4 | శనివారం 26-09-2026
Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:281 | pages:04 | Saturday - 26-09-2026

## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు'.. బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

- ఉక్రెయిన్‌కు బ్రిటన్ క్షిపణి టెక్నాలజీ
- దీనిపై తీవ్రంగా స్పందించిన రష్యా
- బ్రిటన్ సైనిక స్థావరాలపై దాడి చేస్తామంటూ సంకేతాలు
- బ్రిటన్, ఫ్రాన్స్ 'నిప్పుతో చెలగాటం' ఆడుతున్నాయని వ్యాఖ్య
- ఉక్రెయిన్‌లో స్టార్మ్ షాడో తయారీకి మార్గం సుగమం



ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం- మిగతా 2 లో

## ఐరాసలో ఖాళీ సీటులో సులేమానీ ఫొటో

- నెతన్యాహూ ప్రసంగం వేళ ఇరాన్ సంచలన నిరసన!
- నెతన్యాహూ ప్రసంగానికి ఇరాన్ ప్రతినిధుల బహిష్కరణ
- సీటులో సులేమానీ ఫొటో ఉంచిన ఇరాన్
- 2020లో అమెరికా డ్రోన్ దాడిలో సులేమానీ మృతి
- పలుదేశాల ప్రతినిధులూ సభ నుంచి బయటకు
- నెతన్యాహూపై విమర్శలు చేసిన పలువురు నేతలు





### గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి
### ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం



- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల- మిగతా 2 లో

# సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

- కేరళలోని నీలంబూరులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు
- తెలంగాణలో సంక్షేమ పథకాలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వెల్లడి
- మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే నిజమైన నివాళి అని పేర్కొన్న రేవంత్
- కేంద్ర ప్రభుత్వంపై ఓట్లు, పార్టీలు, నిధుల దొంగతనం అంటూ తీవ్ర విమర్శలు



2లో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం-2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్

### వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది



- సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న కవిత
- అనారోగ్యంతో బాధపడుతున్న కార్మిక కుటుంబాలకు న్యాయం చేయడం లేదని మండిపాటు
- ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక

కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన - మిగతా 2 లో

### అమెరికా నుంచి 'ఫైర్ అండ్ ఫర్గెట్' జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత్ మొగ్గు



- జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్న భారత్
- ఆటోమేటెడ్ గైడెన్స్ మెకానిజంతో పని చేసే జావెలిన్ క్షిపణులు
- భారత సైనిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న అత్యాధునిక క్షిపణులు

సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. - మిగతా 2 లో

### శ్రీవారి దర్శనానికి భారీ నిరీక్షణ
### నిండిపోయిన క్యూ కాంప్లెక్స్‌లు



- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- సర్వదర్శనానికి సుమారు 20 గంటల సమయం
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు, బయట బారులు
- గురువారం రూ.4.45 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

తిరుమల శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తడంతో తిరుమల కొండపై రద్దీ విపరీతంగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, భక్తులు వెలుపల ఉన్న క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ సిబ్బంది నిరంతరాయంగా పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. ఇక నిన్న (గురువారం) మొత్తం 66,437 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 26,771 మంది తలనీలాలు సమర్పించారు.

# 'లేక్ ఒంటారియో' పేరు మార్పు
# 'లేక్ అమెరికా'గా ప్రకటించిన ట్రంప్

- సరస్సు పరిరక్షణలో అమెరికాదే కీలక పాత్ర అని వెల్లడి
- 30 రోజుల్లోగా పేరు మార్పు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- ఈ మార్పు కేవలం అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికే వర్తింపు
- గతంలో గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును కూడా మార్చిన వైనం



2లో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా, కెనడా సరిహద్దుల్లో ఉన్న గ్రేట్ లేక్స్‌లో ఒకటైన 'లేక్ ఒంటారియో' పేరును 'లేక్ అమెరికా'గా మారుస్తూ కార్యనిర్వాహక

# డబ్బుతో గెలవాలని చూసేవారికి
# ఓటమి తప్పదు: సీఎం చంద్రబాబు

- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం
- పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక



2లో

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

### పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి



- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్న పవన్
- ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ - మిగతా 2 లో

## పదోసారి సవాల్ చేస్తున్నా



- డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ: నారా లోకేశ్
- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ

"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, - మిగతా 2 లో

# పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

మొదటిపేజీ తరువాయి – హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి – అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు. పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019–24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# తండ్రి పేరు సవరణకు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసులు

మొదటిపేజీ తరువాయి – ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా మంత్రిని కలిసి ఈ నోటీసును అందజేశారు. ఓటర్ల జాబితాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదైంది. ఈ విషయాన్ని గుర్తించిన బీఎల్ఓ, నిబంధనల ప్రకారం సవరణ నిమిత్తం మంత్రికి నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఇది సాధారణంగా జరిగే ప్రక్రియే. ఈ నోటీసులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించారు. తన తండ్రి పేరును సరిచేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఆయన బీఎల్ఓకు సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దేందుకే 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను సరిచూస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రికి కూడా నోటీసు అందినట్లు స్పష్టమవుతోంది.

# పదోసారి సవాల్ చేస్తున్నా

మొదటిపేజీ తరువాయి – టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

### డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్–1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

### స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు.

మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

### మరో మూడుసార్లు గెలవాలి

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు. తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

### జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

# వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది

మొదటిపేజీ తరువాయి – అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య



మొదటిపేజీ తరువాయి – వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్లు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు. ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర

మొదటిపేజీ తరువాయి – నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు

మొదటిపేజీ తరువాయి – నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతుయాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలుబాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుకేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయంనేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు-ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీ) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్-టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80-100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.



# 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు'.. బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి – అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్-రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.ఇదే సమయంలో రష్యా-నాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

# 'లేక్ ఒంటారియో' పేరు మార్పు.. 'లేక్ అమెరికా'గా ప్రకటించిన ట్రంప్

మొదటిపేజీ తరువాయి – ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ సరస్సు అత్యంత కీలకమని, దాని ప్రాధాన్యతను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 30 రోజుల్లోగా ఈ పేరు మార్పు ప్రక్రియను పూర్తి చేయాలని అమెరికా అంతర్గత వ్యవహారాల కార్యదర్శిని, భౌగోళిక నామకరణాల బోర్డును ఆదేశించారు. ఈ నిర్ణయానికి గల కారణాలను ట్రంప్ తన ఉత్తర్వుల్లో స్పష్టంగా వివరించారు. "గ్రేట్ లేక్స్ పరిరక్షణలో అమెరికానే గొప్ప సంరక్షకుడిగా ఉంది. అమెరికా అందిస్తున్న భద్రత, పెడుతున్న పెట్టుబడులు లేకపోతే ఈ మంచినీటి వ్యవస్థ నౌకాయానానికి, వినోదానికి ఈ స్థాయిలో అందుబాటులో ఉండేది కాదు" అని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో గ్రేట్ లేక్స్ పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ కోసం అమెరికా దాదాపు 4 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టిందని, కెనడా పెట్టుబడులు చాలా తక్కువని ఆయన అన్నారు. గ్రేట్ లేక్స్‌లో మంచును తొలగించే 11 నౌకల్లో 9 అమెరికా కోస్ట్ గార్డ్ నిర్వహిస్తున్నవేనని గుర్తుచేశారు. చారిత్రకంగా, వాణిజ్యపరంగా, రక్షణాపరంగా కూడా ఈ సరస్సు అమెరికాకు ఎంతో ముఖ్యమని ట్రంప్ తెలిపారు. న్యూయార్క్‌లోని ఓస్వెగో చారిత్రక కోటగా, సెయింట్ లారెన్స్ సీవే నుంచి అమెరికాలోకి వచ్చే మొదటి ఓడరేవుగా నిలిచిందని ప్రస్తావించారు. ఈ సరస్సు నీటిని తాగునీటి అవసరాలకు, విద్యుత్ ప్లాంట్లకు వినియోగిస్తున్నారని, లక్షలాది అమెరికన్ల ఉద్యోగాలకు ఈ ప్రాంతం ఆధారమని తెలిపారు. అయితే, ఈ పేరు మార్పు కేవలం అమెరికా ఫెడరల్ ప్రభుత్వ వినియోగానికి మాత్రమే వర్తిస్తుంది. ఫెడరల్ ప్రభుత్వ పటాలు, పత్రాలు, ఒప్పందాలు, అధికారిక సమాచారంలో మాత్రమే 'లేక్ అమెరికా' అనే పేరును వాడతారు. కెనడా, అంటారియో ప్రావిన్స్, అంతర్జాతీయ సంస్థలు లేదా ప్రైవేట్ మ్యాప్ ప్రొవైడర్లు ఈ కొత్త పేరును ఉపయోగించాల్సిన అవసరం లేదు. ట్రంప్ ఒక భౌగోళిక ప్రాంతం పేరు మార్చడం ఇదే మొదటిసారి కాదు. 2025 జనవరిలో 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో' పేరును ఫెడరల్ అవసరాల కోసం 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తూ ఆయన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# టారిఫ్‌లతోనే అమెరికా ధనిక దేశంగా మారింది



మొదటిపేజీ తరువాయి – వల్లే అమెరికా అత్యంత ధనిక దేశంగా మారిందని, విదేశీ కంపెనీలు తమ తయారీ యూనిట్లను అమెరికాకు తరలించాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. సౌత్ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. "నాకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్. ఆ పదాన్ని నేను ప్రేమిస్తున్నాను. అది మనల్ని విపరీతంగా ధనవంతుల్ని చేసింది" అని వ్యాఖ్యానించారు. సుంకాల విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, అమెరికన్లకు ఉద్యోగాలు కూడా లభిస్తున్నాయని ఆయన తెలిపారు. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు తాను ఒకటే చెబుతున్నానని ట్రంప్ అన్నారు. "అమెరికాకు కార్లను ఎగుమతి చేయాలంటే 25 శాతం సుంకం కట్టాలి. అది సాధ్యం కాదంటే, ఇక్కడికే వచ్చి మీ కార్ల ఫ్యాక్టరీలను నిర్మించుకోవాలి. ఇప్పుడు సౌత్ కరోలినాలో అదే జరుగుతోంది" అని ఆయన వివరించారు. ఈ విధానం వల్ల దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ పెట్టుబడులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విధానాల వల్ల అమెరికాలోకి సుమారు 19.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని ట్రంప్ తెలిపారు. దేశవ్యాప్తంగా వందల, వేల సంఖ్యలో ఫ్యాక్టరీలు నిర్మిస్తుండటంతో నిర్మాణ రంగంలో ఉద్యోగాలు భారీగా పెరిగాయని అన్నారు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే తాను తెచ్చిన పన్ను, వాణిజ్య విధానాలు తలకిందులవుతాయని, ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల నియంత్రణ కొనసాగేందుకు తమ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు.

## ప్రగతి నగర్ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన చేసిన ఆల్విన్ కాలనీ సర్కిల్ డిసి చాముండేశ్వరి



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 25:** కూకట్‌పల్లి ప్రగతి నగర్ చెరువు వద్ద ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జన కేంద్రాన్ని ఆల్విన్ కాలనీ సర్కిల్ డిసి చాముండేశ్వరి, ఇతర అధికారులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బందికి పలు సూచనలు, భద్రత చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జన్న కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పి సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం వార్షికోత్సవానికి మంత్రి శ్రీధర్ బాబుకు ఆహ్వానం



**నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 25:** భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ ఐటీ, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును సంఘం ప్రతినిధులు కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం నిర్వహించనున్న వార్షికోత్సవ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించినట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి సంఘం చేపడుతున్న కార్యక్రమాలను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, మరియు కమిటీ సభ్యులు వెంకటేష్ యాదవ్, చందేరి కొండల్ రెడ్డి, రమేష్ యాదవ్, నాగేశ్వరరావు, నరేష్ కుమార్, మధు, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 39 లక్షలకు బాలాపూర్ గణేష్ లడ్డు



**నిజం న్యూస్ హైదరాబాద్ సెప్టెంబర్ 25:** తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ గణేష్ లడ్డూ ప్రసాదం వేలంలో మరోసారి సరికొత్త రికార్డు నమోదయింది. ఈ ఏడాది గణనాధుని లడ్డు ప్రసాదాన్ని వనస్థలిపురం సాహెబ్ నగర్ కు చెందిన అర్బన్ గ్రూప్ అధినేత సామ ప్రణీత్ రెడ్డి రూ. 39 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 35 లక్షలు పలికిన లడ్డు ప్రసాదం ధర ఈసారి మరో రూ. నాలుగు లక్షలు పెరిగి రూ. 39 లక్షలకు చేరింది. వేలంలో మొత్తం 8 మంది భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా, హోరా హోరీగా సాగిన పోటీలో సామ ప్రణీత్ రెడ్డి అత్యధికంగా రూ. 39 లక్షలు పాడి లడ్డూను సొంతం చేసుకున్నారు. గణనాధుని ఆశీస్సులతో తమ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని, సమాజంలోని ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు ప్రణీత్ రెడ్డి తెలిపారు. లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న ప్రణీత్ రెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు ఘనంగా అభినందించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 25:** కూకట్పల్లి నియోజకవర్గం శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు శుక్రవారం ఉదయం తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కి వేద ఆశీర్వచనాలు అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో పాటు అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ మామిడాల రవీందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, వెంకట్ రాజు, రామకృష్ణ చౌదరి తదితరులు శ్రీవారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## నిమజ్జనం నేర్పే సత్యం

మనం ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచే గణపతి స్వామి



**నిజం న్యూస్ హైదరాబాద్, సెప్టెంబర్ 25:** నిమజ్జనం రోజున నీటిలో కరిగిపోయి, చివరికి మళ్లీ భూమిలో కలిసిపోతారు. ఈ సృష్టిలో పుట్టిన ప్రతీ ప్రాణి, ప్రతీ వస్తువు ఏదో ఒక రోజు ఈ ప్రకృతిలో కలిసిపోవాల్సిందే. అందుకే ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు. మనం కూడబెట్టే ఆస్తులు, హోదాలు, తాత్కాలిక బంధాలు, అహంకారాలు... ఏవీ మనతో పాటు శాశ్వతంగా ఉండవు. ఈ జీవితం చాలా చిన్నది. ఉన్న కొద్ది రోజుల్లో ఎవరికీ చెడు తలపెట్టకుండా, అందరితో ప్రేమగా ఉండాలి. మనం వెళ్ళిపోయేటప్పుడు ఏదీ వెంట తీసుకెళ్ళలేం. అందుకే ఉన్నంతలో మంచిగా జీవించండి... నలుగురికీ మంచి చేసి వెళ్ళండి! అదే నిజమజ్జనం మనకు నేర్పే అసలైన జీవిత సత్యం.

## రాంనగర్ కాలనీ మైసమ్మ యూత్ ఆధ్వర్యంలో వినాయక శోభాయాత్ర లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న 3 వార్డ్ నెంబర్ రాదారపు మహేష్



**ఉమ్మడి నల్లగొండ జిల్లా నిజం న్యూస్ సెప్టెంబర్ 25 భూతం శ్రీకాంత్ రిపోర్టర్:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామం లో రాంనగర్ కాలనీ మైసమ్మ యూత్ ఆధ్వర్యంలో వినాయక శోభాయాత్ర ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ రాంనగర్ కాలనీ భక్తులందరూ పాల్గొని ఘనంగా నిర్వహించడం జరిగింది.

## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఎమ్మెల్యే గాంధీకి ఈ డి సామాన్లు

రూ.2.1 కోట్ల లావాదేవీలపై విచారణకు పిలుపు

తమకు ఎలాంటి నోటీసులు అందలేదన్న పీఏ రమేష్



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 25:** సైబరాబాద్-మీసాల భారతి సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మనీ లాండరింగ్ కేసులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి ఈడి సామాన్లు జారీ చేసినట్లు సమాచారం. సెప్టెంబరు 27న విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు తెలుస్తుంది. సాహితి ఇన్‌ఫ్రా నుంచి ఎమ్మెల్యే బ్యాంకుకు ఖాతాల ద్వారా సుమారు రూ. 2.1 కోట్లు బదిలీ అయినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ లావాదేవీల స్వభావం, నిధుల వినియోగం, వాటికి సంబంధించిన వ్యాపార కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది. సాహితి ఇన్‌ఫ్రా ప్రాజెక్టులలో కొనుగోలుదారుల నుంచి భారీగా నిధులు సేకరించి మోసం చేశారన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతుంది. అయితే ఎమ్మెల్యే పిఎ గంగుల రమేష్ స్పందిస్తూ... తమకు ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారని తెలిపారు. దీంతో ఈడి సామాన్ల వ్యవహారంపై స్పష్టత రావాల్సి ఉంది.

## దిగ్విజయం గా నమామి భరత్ సామూహిక వందే మాతరం గాన కార్యక్రమం



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి సెప్టెంబర్ 25:** విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన నమామి భరత్ సామూహిక వందే మాతరం గాన కార్యక్రమం" శ్రీ సరస్వతి శిశు మందిర్ హై స్కూల్, కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో భువన విజయమ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 294 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఆచార్యులు మరియు ఇతర పాల్గొన్నవారు ఎంతో ఉత్సాహంతో, దేశభక్తి భావంతో సామూహికంగా వందే మాతరం గీతాన్ని ఆలపించారు. ప్రతి ఒక్కరి చురుకైన భాగస్వామ్యం మరియు సహకారంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు
నాగేశ్వర్ రావు ,సమితి కోశాధికారి
రఘువీర్ రావు ,కమిటీ సభ్యులు
బి వి ఆర్ మూర్తి , కమిటీ సంయుక్త కార్యదర్శి
వెంకట్ రావు ,సమితి సంయుక్త కార్యదర్శి
రమేష్ ప్రధానోపాధ్యాయులు,
అయ్యన్న ,
పవన్ నర్వ

ప్రముఖుల పాల్గొనడం, విద్యార్థులు మరియు ఆచార్యుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో నమామి భరత్ సామూహిక వందే మాతరం గాన కార్యక్రమం" అత్యంత ఘనంగా . జరిగింది.

## భక్తితో ఆనందం... 9 రోజులు వినాయక చవితి, వైభవ నిమజ్జనం



**నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి ,సెప్టెంబర్ 25:** శేర్లింగంపల్లి అసెంబ్లీ, వివేకానంద నగర్ డివిజన్, కమల ప్రసన్న నగర్ కాలనీలో శ్రీ కమల ప్రసన్న వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా జరుగుతున్న భారీ గణనాథుని నిమర్జనం కార్యక్రమం ఈసారి కూడా అంగరంగా, వైభవంగా జరిగింది. వినాయకుడి ఆశీస్సులతో పాటు భక్తి బృందంలోని ప్రతి ఒక్కరి భగవంతుని పట్ల ప్రేమ కూడా కార్యక్రమంలో కనిపించింది. శ్రీ కమల ప్రసన్న వినాయక భక్త బృందం కమిటీ అధ్యక్షుడు నాయకం రాజు ఆధ్వర్యంలో 9 రోజులు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి రోజూ భక్తి ఉత్సాహం కాలనీ అంతా మారుమోగేలా చేసింది. గణపతి పూజతో మొదలైన ఆనందం గణనాథుని నిమర్జనం దినం వరకు కొనసాగి, ప్రతి భక్తుని ముఖాల్లో ఆనందం కనిపించింది. ఈ వేడుకల సందర్భంగా నిర్వహించిన నృత్యం అందర్నీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఎస్ కట్ట డాన్స్ ఫ్లోర్ విద్యార్థిని కుమారి నాయకోటి మేధాశ్రీ చేసిన ప్రదర్శన అందరినీ ఆశ్చర్యపరిచింది. 8 ఏళ్ల చిన్నారి కూడా ఇంత అద్భుతంగా నాట్యం చేసిందని కాలనీ వాసులు చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో వినాయకుని మహాప్రసాదం లడ్డూ వేలంపాట కూడా జరిగింది. స్వామివారి లడ్డూని పల్లె మదన గోపాల్ రెడ్డి (డాడీ) 3,50,000/- రూపాయలకు దక్కించుకున్నారు. భక్తితో పాటు నిస్వార్థమైన మనసు కూడా ఇందులో కనిపించిందని ప్రజలు చర్చించుకున్నారు. ఈ వైభవమైన నిమర్జనంతో కాలనీకి గణనాథుని దయ, శాంతి, సంతోషం మరింత చేరాలని శ్రీ కమల ప్రసన్న వినాయక భక్త బృందం ప్రార్థిస్తోంది. భవిష్యత్తులో కూడా ఇలాగే అందరి హృదయాలను వెలిగించేలా వేడుకలు కొనసాగించాలని కోరుకుంటున్నారు.

## ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ఏఐఎస్ఎఫ్ ధ్యేయం

ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి. పుట్ట లక్ష్మణ్.

నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి, సెప్టెంబర్ 25:

ఉప్పల డిపో వద్ద ఘనంగా ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా 4వ మహాసభలు..




అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా 4వ మహాసభలు బోడుప్పల్ సర్కిల్, ఉప్పల్ డిపో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మహాసభల సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యారంగ సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేసారు. అనంతరం ఉప్పల్ డిపో వద్ద ఉన్న "ది వ్యూ ఫంక్షన్ హాల్" ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్వేతా అరుణ పతాకాన్ని (ఏఐఎస్ఎఫ్ జెండా)ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఉమా మహేష్ ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై, విద్యా రంగ పరిరక్షణ కోసం నిర్వహించిన పోరాటాల చరిత్రను వివరించారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన ఉద్యమాలు, విద్యార్థుల హక్కుల సాధనలో సంఘం పోషించిన పాత్రను ఆయన ప్రస్తావించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా విధానాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా పుట్ట లక్ష్మణ్ మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సౌకర్యాలు, నిరుద్యోగం వంటి అంశాలపై విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సమస్యలే కాకుండా సామజిక సమస్యలపై, సమాజంలో జరుగుతున్న అక్రమాలపై పోరాడుతుందని అన్నారు. సామజిక, సేవా కార్యక్రమాలు చేయడంలో కూడా ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అగ్రభాగాన ఉంటుంది అని తెలియజేసారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు, మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ.... మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, ప్రభుత్వ విద్యాసంస్థల ఏర్పాటు కోసం, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందేవరకు ఏఐఎస్ఎఫ్ గా పోరాటాలు కొనసాగిస్తుందని, ఇందులో పని చేసిన వారు నేడు ఉన్నతమైన స్థానంలో ఉన్నారని, విద్యార్థి సంఘానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నదని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ మహాసభల్లో సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చిన్నబాబు, ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు శ్రీకాంత్, బద్రి, సద్గురు చారి, శివమణి, ప్రణవ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రులు సందర్భంగా చంటి యూత్ ఆధ్వర్యంలో రామన్నపేట ఎస్సై కీ సన్మానం చేశారు



**ఉమ్మడి నల్లగొండ జిల్లా నిజం న్యూస్ సెప్టెంబర్ 25** భూతం శ్రీకాంత్ రిపోర్టర్: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామం చంటి యూత్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం సందర్భంగా రామన్నపేట ఎస్సై గోపాటి సతీష్ శాలువతో ఘనంగా సన్మానం చేశారు. 2 వార్డ్ నెంబర్, సింగనబోయిన బాలరాజు, 3వ వార్డ్ మెంబర్ రాధారపు మహేష్, చంటి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గణపతి బప్పా మోరియా

ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) శ్రీ గణేష్ మహా అన్నప్రసాద కార్యక్రమానికి హాజరు...




**నిజం న్యూస్ ప్రతినిధి, ఉప్పల్, సెప్టెంబర్ 25 :** హబ్సిగూడలోని నవ్కార్ గోల్డ్ వరల్డ్ -- అరిహంత్ ఫ్యాషన్ వరల్డ్ నవ్కార్ గోల్డ్ యజమానులు అమిత్ భాయ్ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు నిర్వహించిన శ్రీ గణేష్ మహా అన్నప్రసాద కార్యక్రమానికి ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) శ్రీ గణేష్ స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహకులు అమిత్ భాయ్, కుటుంబ సభ్యులను కలిసి కార్యక్రమం నిర్వహించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో పల్లె రాజ్‌కుమార్ అన్న, రమేష్ గౌడ్ అన్న, యాకేష్, పవన్, దత్తు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు

పలు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్



**నిజం న్యూస్ ప్రతినిధి, బోడుప్పల్, సెప్టెంబర్ 25 :** బోడుప్పల్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బోడుప్పల్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ గణేష్ మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడికి పుష్పాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, బోడుప్పల్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమాల్లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయవాడలో తొలిసారిగా ఢిల్లీ స్థాయి జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026

అక్టోబర్ 08 నుంచి 22 వరకు పున్నమి ఘాట్‌లో 600 స్టాళ్లతో నిర్వహణ

దేశవ్యాప్తంగా 2,500 మంది మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ కళాకారుల భాగస్వామ్యం

ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులకు జాతీయ స్థాయి మార్కెటింగ్, బ్రాండింగ్, విక్రయాలకు భారీ వేదిక

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ: సెప్టెంబర్ 25, 2026:** విజయవాడ నగరంలో తొలిసారిగా ఢిల్లీ స్థాయిలో జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026 నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్ 08 నుంచి 22వ తేదీ వరకు పున్నమి ఘాట్‌లో సుమారు 600 స్టాళ్లతో ఈ మేళాను నిర్వహించనున్నారు. మేళా నిర్వహణకు ఎంపిక చేసిన పున్నమి ఘాట్ ప్రాంతాన్ని శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, స్టాళ్ల ఏర్పాటు, భద్రత, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, సందర్శకుల సౌకర్యాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మేళా నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, ఎన్ఆర్ఎల్ఎం జాయింట్ సెక్రటరీ స్వాతి శర్మ, డైరెక్టర్ మౌలిశ్రీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ సరస్ ఆజీవిక మేళా మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి విక్రయించుకునే మార్కెటింగ్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. గత ఏడాది గుంటూరులో సుమారు 300 స్టాళ్లతో నిర్వహించిన సరస్ మేళాలో సుమారు రూ.30 కోట్ల మేర వ్యాపారం జరిగినట్లు తెలిపారు. ఈసారి విజయవాడలో 600 స్టాళ్లతో మరింత భారీ స్థాయిలో మేళాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 2,500 మంది మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ రాష్ట్రాలకు ప్రత్యేకమైన హస్తకళలు, చేనేత, ఆహార పదార్థాలు, సహజ ఉత్పత్తులు, గ్రామీణ కళాకృతులను ప్రదర్శించి విక్రయించనున్నట్లు తెలిపారు. మేళాలో హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్, నేచురల్ ఫుడ్, లైవ్ ఫుడ్ తదితర విభాగాలతో పాటు నాబార్డ్, ఎంఎస్ఎంఈ, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సరస్ మేళా ద్వారా ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానాలు, బ్రాండింగ్, విలువ జోడింపు, నాణ్యత, ప్యాకేజింగ్, విక్రయాల విస్తరణకు అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. కొనుగోలుదారులు, సంస్థలు, మార్కెట్ ఏజెన్సీలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడటం ద్వారా మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యులకు కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తద్వారా వారి ఆదాయం, స్థిరమైన జీవనోపాధికి మేళా దోహదపడుతుందని తెలిపారు. వెల్‌కమ్ పెవిలియన్, లెర్నింగ్ అండ్ నాలెడ్జ్ పెవిలియన్, కన్వర్జెన్స్ పెవిలియన్, లక్షపతి దీదీ పెవిలియన్, ఫుడ్ కోర్ట్, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, పిల్లల ఆటల ప్రాంతం, పార్కింగ్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**మహిళా సాధికారతకు సరస్ మేళా గొప్ప అవకాశం: కొండపల్లి శ్రీనివాస్**

రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళా సాధికారతకు జాతీయ సారస్ ఆజీవిక మేళా గొప్ప అవకాశంగా నిలుస్తుందని అన్నారు. సాధారణంగా ఢిల్లీలో నిర్వహించే స్థాయి సారస్ మేళాను ఈ ఏడాది విజయవాడలో నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందన్నారు. ఇతర రాష్ట్రాల ఎస్‌హెచ్‌జీలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెట్,

నిజం
దృష్టి తెలుగు న్యూస్
శనివారం 26-09-2026

# టీసీఎస్ లాభం 12,380 కోట్లు

దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.12,380 కోట్ల నికర లాభం ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.11,058 కోట్ల లాభంతో పోలిస్తే 11.95 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.6 శాతం ఎగబాకి రూ. 60,583 కోట్ల నుంచి రూ.63,973 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన రూ.64,259 కోట్లతో పోలిస్తే భారీగా తగ్గింది. గత త్రైమాసికంలో కొత్తగా 10.2 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివాసన్ తెలిపారు.

సంస్థకు భారత్ నుంచి సమకూరిన ఆదాయంలో 70 శాతం పెరుగుదల నమోదైంది. మొత్తం ఆదాయంలో ఈ వాటా 9 శాతంగా ఉన్నది.

గత త్రైమాసికంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల నుంచి 3.2 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు లభించాయి.

గత మూడు నెలల్లో సంస్థ నుంచి 5 వేల మంది సిబ్బంది వెళ్లిపోయారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.07 లక్షలుగా ఉన్నారు.

ఉద్యోగుల వలసలు 13 శాతంగా నమోదయ్యాయి.

ఈ ఏడాది కొత్తగా క్యాంపస్‌ల నుంచి 40 వేల మందిని నియమించుకోనున్న సంస్థ..వచ్చే ఏడాది దీనికంటే అధికంగా రిక్రూట్ చేసుకోనున్నది.

ప్రస్తుత సంవత్సరానికిగాను ప్రతిషేరుకు రూ.66 ప్రత్యేక డివిడెండ్‌ను కలుపుకొని మొత్తంగా రూ.76 డివిడెండ్‌ను చెల్లించనున్నది.

### నష్టాల్లోనే దేశీయ స్టాక్ మార్కెట్లు

# 528 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలతో పాటు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, కార్పొరేట్ కంపెనీలు త్రైమాసిక ఫలితాల ప్రకటనల నేపథ్యంలో మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 78,206.21 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటిక సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 78,206.21 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. ఒక దశలో 77,542.92 పాయింట్ల కనిష్ఠానికి పతనమైంది. చివరకు స్వల్పంగా కోలుకుంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 528.28 పాయింట్లు పతనమై.. 77,620.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పాయింట్లు తగ్గి 23,526.50 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,175 లాభపడగా.. మరో 2,610 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ, టాటా స్టీల్, కోల్ ఇండియా, బీపీసీఎల్ నష్టపోయాయి. హెచ్‌యూఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, ఎంఅండ్ఎం, బజాజ్ ఆటో లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్ని సూచీలు.. ఐటీ, మెటల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, పవర్, రియాల్టీ ఒకటి నుంచి రెండుశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు తగ్గుముఖం పట్టాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.86 వద్ద ఉన్నది.

### వారాంతంలో కూడా భారీ నష్టాలు

# ఆల్‌టైం కనిష్టానికి రూపాయి



దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో (జనవరి 10న) భారీ నష్టాలతో ముగిశాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 241 పాయింట్లు పడిపోయి 77,378.62 వద్దకు చేరుకోగా, నిఫ్టీ 95 పాయింట్లు తగ్గిపోయి 23,431కు చేరింది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 769 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 1160 పాయింట్లు పతనమయ్యాయి. దీంతో మదుపర్లు ఒక్కరోజులోనే లక్షల కోట్ల రూపాయలను నష్టపోయారు. మధ్యాహ్నం 3 గంటలకు 779 షేర్లు పురోగమించగా, 3,173 షేర్లు క్షీణించాయి. 93 షేర్లు మారలేదు.

**కరెన్సీ బలహీనత**

ఈ క్రమంలోనే 52 వారాల గరిష్టాన్ని నమోదు చేసిన స్టాక్‌ల సంఖ్య 99 కాగా, 52 వారాల కనిష్ట స్థాయిని నమోదు చేసిన స్టాక్‌ల సంఖ్య 255గా ఉంది. అప్పర్ సర్క్యూట్‌లో మొత్తం 166 షేర్లు, లోయర్ సర్క్యూట్‌లో 366 షేర్లు ట్రేడయ్యాయి. వ్యవసాయేతర పేరోల్స్ నివేదిక నేపథ్యంలో డాలర్ పుంజుకుంది. దీంతో ప్రాంతీయ కరెన్సీ బలహీనత పెరిగింది. ఈ నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 85.9400కి చేరుకుంది.

**టాప్ 5 లాసింగ్ స్టాక్స్**

ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు టాప్ గెయినర్లుగా టెక్ మహీంద్రా, టెక్నాలజీస్, విప్రో, ఇన్ఫోసిస్ ఉండగా, టాప్ లూజర్స్ స్టాక్స్‌లలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నాయి. దీంతో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 2.08 శాతం తగ్గి 54,585.75 వద్ద ముగిసింది. మరోవైపు, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం నష్టాలతో 17,645.55 వద్ద ముగిసింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు టాప్ గెయినర్లుగా, టెక్ మహీంద్రా, టెక్నాలజీస్, విప్రో, ఇన్ఫోసిస్ ఉండగా, టాప్ లూజర్స్ స్టాక్స్‌లలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నాయి. దీంతో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 2.08 శాతం తగ్గి 54,585.75 వద్ద ముగిసింది. మరోవైపు, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం నష్టాలతో 17,645.55 వద్ద ముగిసింది.

**ఇక రంగాల వారీగా చూస్తే..**

రంగాల వారీగా నిఫ్టీ ఐటీ లాభాలలో అగ్రగామిగా 3.44 శాతం పెరిగింది. మీడియా (3.59 శాతం తగ్గింది), రియాల్టీ (2.77 శాతం తగ్గింది), బ్యాంక్ (2.72 శాతం తగ్గింది). హెల్త్‌కేర్ (2.21 శాతం) తగ్గింది. టెక్ స్టాక్‌లు కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, బేరిష్ సెంటిమెంట్‌ను ప్రతిబింబిస్తూ మెటల్స్, ఫైనాన్షియల్స్ ఒత్తిడిలోకి వెళ్లాయి.

**ఒప్పందాలు..**

గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ లిమిటెడ్ కంపెనీ అనుబంధ సంస్థ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ద్వారా విదేశీ అనుబంధ సంస్థను విలీనం చేయడం గురించి ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. డిష్మాన్ కార్బోజెన్ ఎమెసిస్ లిమిటెడ్ తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థగా ప్రకటించింది. బెంగళూరులో రూ. 700 కోట్ల భూ సేకరణ తర్వాత పురవంకర షేర్లు 2.22% పడిపోయాయి. పురవంకర షేర్లు 2.22% తగ్గి రూ. 362.70 వద్ద ట్రేడయ్యాయి. రూ. 700 కోట్ల ఆదాయంతో గృహనిర్మాణ ప్రాజెక్టును నిర్మించేందుకు కంపెనీ బెంగళూరులో 3.63 ఎకరాల భూమిని సేకరించింది.

# దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం

# చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ

ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది.

**వారానికి 90 గంటలు పని చేయాలన్న ఎల్‌అండ్‌టీ చైర్మన్**



ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్‌అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్లు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

# స్మాల్-మిడ్ క్యాప్‌దే హవా



**స్టాక్ మార్కెట్లలో మ్యూచువల్ ఫండ్ స్కీముల జోరు**

**డిసెంబర్‌లో 14 శాతం ఎగిసిన పెట్టుబడులు**

మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీ స్కీముల్లోకి వచ్చే పెట్టుబడులు గత నెలలో 14 శాతానికిపైగా పెరిగాయి. డిసెంబర్‌లో రూ. 41,156 కోట్లకు చేరాయి. నిజానికి దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకుల్లో ఉన్నప్పటికీ ఈ స్థాయిలో పెట్టుబడులు రావడం విశేషం. కాగా, చిన్న, మధ్యతరహా మ్యూచువల్ ఫండ్స్ స్కీములు మదుపరులను ఆకట్టుకుంటూనే ఉన్నాయి. దీంతో గత నెల రికార్డు స్థాయికి పెట్టుబడులు వెళ్లాయని భారతీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం (యాంఫీ) తాజాగా తెలియజేసింది.

**సిప్‌లు ఆకర్షణీయం**

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మదుపరులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. నవంబర్‌తో చూస్తే డిసెంబర్‌లో సిప్‌ల్లోకి పెట్టుబడులు రూ.25,320 కోట్ల నుంచి రూ.26,459 కోట్లకు పెరిగాయి. దీంతో సిప్ నిర్వహణలోని మొత్తం ఆస్తులు రూ.13.63 లక్షల కోట్లకు చేరాయి. మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల్లో ఇది దాదాపు ఐదో వంతుకు సమానం. గత ఏడాది డిసెంబర్ 31నాటికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తులు రూ.66.93 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే నవంబర్ 30న ఇవి రూ.68.08 లక్షల కోట్లుగా ఉన్నాయి. కాగా, స్టాక్ మార్కెట్లు దిద్దుబాటు దిశగా వెళ్లడంతో డెట్ స్కీముల నుంచి రూ.1.27 లక్షల కోట్ల పెట్టుబడులను మదుపరులు వెనక్కి తీసుకున్నారని, దానివల్లే ఈ తగ్గుదల అని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని తెలిపారు.

**మున్ముందు అనిశ్చిత పరిస్థితులే..**

సమీప భవిష్యత్తులో దేశీయ స్టాక్ మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితుల్నే చూస్తామని యాంఫీ సీఈవో వెంకట్ చలసాని చెప్తున్నారు. అమెరికాలో అధ్యక్షుడిగా ట్రంప్ వస్తుండటం.. మార్కెట్లను ఎక్కువగా ప్రభావితం చేయవచ్చని అంటున్నారు. ప్రతీకార సుంకాలు ప్రభావం చూపవచ్చన్న అంచనాలున్నాయి. అయితే దేశీయ మదుపరులు స్టాక్స్‌లో పెట్టుబడులపట్ల ఆసక్తితోనే ఉంటారన్న అభిప్రాయాన్ని చలసాని వ్యక్తం చేశారు. సిప్ పెట్టుబడులు.. స్టాక్ మార్కెట్లపై ఇన్వెస్టర్లకున్న ఉన్న విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు.

**33 న్యూ ఫండ్ ఆఫర్స్**

అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు డిసెంబర్‌లో మొత్తం 33 కొత్త ఫండ్లను ఆఫర్ చేశాయి. వీటి ద్వారా రూ.13,643 కోట్లకుపైగా నిధులను సమీకరించాయి. అంతకుముందు నెల నవంబర్‌లో 18 స్కీములు పరిచయమవగా, రూ.4,000 కోట్ల నిధుల సమీకరణే జరిగినట్టు యాంఫీ తాజాగా ప్రకటించింది. ఇదిలావుంటే థీమ్యాటిక్ కేటగిరీ డిసెంబర్‌లో రూ.15,331 కోట్ల పెట్టుబడుల్ని అందుకున్నది. నవంబర్‌లో ఇది రూ.7,658 కోట్లే. ఇక మిడ్‌క్యాప్ కేటగిరీలోకి రూ.5,093 కోట్లు, స్మాల్‌క్యాప్ రూ.4,667 కోట్లను పొందాయి. బడా స్కీముల్లోకి రూ.2,010 కోట్లు వచ్చాయి. గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌ల్లోకి రూ.640 కోట్ల పెట్టుబడులు వచ్చాయని యాంఫీ సీఈవో చలసాని చెప్పారు.

# మార్కెట్లకు బ్లూ-చిప్ దెబ్బ

**అమ్మకాల ఒత్తిడిలో బడా షేర్లు**
**సెన్సెక్స్ 528, నిఫ్టీ 162 పాయింట్లు డౌన్**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలకు లోనయ్యాయి. మార్కెట్ హెవీ వెయిట్ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను ప్రకటించే ఆర్థిక ఫలితాలు ఎలా? ఉంటాయోనన్న భయాందోళనలు మదుపరులను వెంటాడాయి. అలాగే తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. పేలవమైన చైనా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, అమెరికా బాండ్లలో అమ్మకాల ఒత్తిడి కూడా నష్టపర్చాయి. ఈ క్రమంలోనే అంతా పెట్టుబడుల ఉపసంహరణకు తెగబడ్డారు. దీంతో బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 528.28 పాయింట్లు లేదా 0.68 శాతం పడిపోయి 78వేల మార్కుకు దిగువన 77,620.21 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 605.57 పాయింట్లు క్షీణించడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 162.45 పాయింట్లు లేదా 0.69 శాతం దిగజారి 23,526.50 వద్ద ముగిసింది.

**సెన్సెక్స్ 30 షేర్లలో..**

టాటా స్టీల్, జొమాటో, ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్, అదానీ పోర్ట్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా సెన్సెక్స్‌లో నష్టాలను చవిచూశాయి. దేశీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అక్టోబర్-డిసెంబర్‌కుగాను 11.95 శాతం వృద్ధితో రూ.12,380 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అయితే మార్కెట్ ముగిశాక ఈ ఆర్థిక ఫలితాలు వెలువడ్డాయి. దీంతో ఆ షేర్‌పై ఈ ప్రభావం లేకుండాపోయింది.

ఇక నెస్లే, హిందుస్థాన్ యునీలివర్, ఎంఅండ్ఎం, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు పుంజుకున్నాయి.

**రంగాలవారీగా..**

రియల్టీ 2.90 శాతం, చమురు-గ్యాస్ 2.19 శాతం, ఎనర్జీ 1.83 శాతం, పవర్ 1.68 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.54 శాతం, బీఎస్ఈ ఫోకస్డ్ ఐటీ 1.14 శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 1.17 శాతం, మిడ్‌క్యాప్ 0.96 శాతం మేరకు పడిపోయాయి. కాగా, ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లూ మిశ్రమంగా ట్రేడ్ అవుతున్నాయి.



# ఇండియాఏఐతో మైక్రోసాఫ్ట్ జట్టు



**2026 నాటికి 5 లక్షల మందికి 'ఏఐ'లో శిక్షణ**

**మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ చందోక్ వెల్లడి**

కేంద్ర ప్రభుత్వానికి చెందిన కృత్రిమ మేధ (ఏఐ) ప్రాజెక్ట్ 'ఇండియాఏఐ'తో అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చేతులు కలిపింది. ఈ భాగస్వామ్యంలో దేశంలోని విద్యార్థులు, టీచర్లు, డెవలపర్లు, ప్ర?భుత్వ అధికారులు, మహిళా పారిశ్రామికవేత్తలు సహా మొత్తం 5 లక్షల మందికి ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ వెల్లడించారు. "భారత్‌లో 20 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు గత ఏడాదే ప్రకటించాం. ఇప్పటికే 24 లక్షల మందికి శిక్షణ అందించాం. వచ్చే ఐదేళ్లలో కోటి మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తాజాగా ప్రకటించడం జరిగింది. ఇందుకోసం ఇండియాఏఐ మిషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకు న్నాం. ఈ ఒప్పందంలో భాగంగా 5 లక్షల మందికి శిక్షణ అందిస్తాం" అని చందోక్ పేర్కొన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా మైక్రోసాఫ్ట్ 10 రాష్ట్రాలోని 20 నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్ఎస్‌టీఐ), ఎన్ఐఈఎల్ఐటీ సెంటర్లలో ఏఐ ప్రొడక్టివిటీ ల్యాబ్స్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రాల ద్వారా 20,000 మంది టీచర్లకు ఏఐ ఫండమెంటల్స్ శిక్షణ ఇవ్వడంతోపాటు 200 ఐటీఐల్లో 1,00,000 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ఏఐ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే, 'ఏఐ క్యాటలిస్ట్స్' పేరుతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు చందోక్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామాల్లో ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు లక్ష మంది ఏఐ డెవలపర్లకు మద్దతివ్వనున్నారు. సమాజానికి పనికివచ్చే పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహించనున్నారు.

**సరికొత్త ఆవిష్కరణల కోసంకృషి చేయాలి: నాదెళ్ల**

కృత్రిమ మేధలో సరికొత్త ఆవిష్కరణల కోసం భారత్ కృషి చేయాలని, సొంత ఫౌండేషనల్ మోడల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల అన్నారు. కానీ, ఇందుకు పెట్టుబడుల లేమి ప్రధాన అవరోధమని, ఒక్క పురోగతి మొత్తం స్థితిగతులను మార్చగలదన్నారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఏఐ టూర్ రెండో రోజు (బుధవారం) నాదెళ్ల ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషలు, ఏఐ ద్వారా పారిశ్రామిక పరివర్తనం అంశాల్లో భారత్ గొప్పగా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం భారత్ గూగుల్, ఓపెన్ ఏఐ తదితర సంస్థలు అభివృద్ధి చేసిన ఏఐ ఇంజన్లు లేదా ఫౌండేషనల్ మోడల్స్‌ను ఉపయోగించుకుంటోంది.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moosapet, Hyderabad, pin code 500018.